సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త!
ఎన్నికల సంఘం ఎన్నికల నియమావళి అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తోంది. ఉద్యోగులు తమ విధుల నిర్వహణకే పరిమితం కావాలని అధికారులు సూచిస్తున్నారు. 10లో▸



సింగరేణి కార్మికుల ఆందోళన
లాభాల వాటా నిలిపివేతపై సింగరేణి కార్మికులు సోమవారం నిరసనలు వ్యక్తం చేశారు. గనులపై ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆందోళనలు జరిగాయి. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0 /24.0
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

21 నుంచి పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాలు

మంచిర్యాలక్రైం: రామగుండం కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్లలో ఈ నెల 21 నుంచి 31వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోలీసుస్టేషన్లలో ఓపెన్ హౌస్, ఆన్‌లైన్‌లో విద్యార్థులు, పోలీసులకు వేర్వేరుగా వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు, పోలీసు అమరవీరులను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ, షార్ట్ ఫిలిం, ఫొటో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 21న పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు.

ఆల్ ఇండియా పోటీలకు పీఈటీ వరలక్ష్మి



వరలక్ష్మి

భీమిని: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలకు భీమిని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పీఈటీ వరలక్ష్మి ఎంపికయ్యారు. ఈ ఏడాది ఆగస్టులో హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ కబడ్డీ ఎంపిక పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారు. డీఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం నాయకులు రామ్మోహన్‌రావు, గోపాల్, శ్రీనివాస్, జ్యోతి, మంజుల అభినందించారు.

కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు, డీసీపీ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం మాట్లాడుతూ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని అన్నారు. అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో 17న బాల్క సుమన్ దిష్టిబొమ్మలు దహనం చేస్తామని తెలిపారు. నిరసనకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సిరిపురం రాజేష్, సాగే సుమోహన్, శంకర్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతప్‌రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు కాచం సతీష్, ఉపాధ్యక్షులు చౌదరి సురేష్, మద్దెల సంజీవ్, పడాల సంతోష్, కే.శ్రీనివాస్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



సిబ్బందితో మాట్లాడుతున్న సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల, ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల క్రియాథాన్ విజేతగా వెంకటేష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో 18ఏళ్లు నిండిన వారందరినీ చేర్చడంలో విశేష కృషి చేసి ఎలక్షన్ క్రియాథాన్-2023 విజేతగా నిలిచిన డీపీవో డిస్ట్రిక్ నాలెడ్జ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ఉద్యోగి మంతెన వెంకటేష్‌ను కలెక్టర్ వెంకటేష్ సోమవారం అభినందించారు. కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యంతో కలిసి వెంకటేష్‌కు రూ.20 వేల చెక్కు అందజేశారు.

ఆశావహుల్లో అయోమయం!

- టికెట్ల ప్రకటనలో జాప్యంతో ఉత్కంఠ
- పోటీలో ఉండే వారిపై రాని స్పష్టత
- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఇబ్బందులు



జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆరాటపడుతున్న ఆశావహులకు తమ పార్టీల తీరు ఆందోళన కలిగిస్తోంది. టికెట్ ఆశిస్తున్న వారి పార్టీలో అనుకోని పరిణామాలు ఎదురవుతుండడం ఉత్కంఠకు గురిచేస్తోంది. జిల్లాలో ఇప్పటికీ బరిలో నిలిచే ప్రధాన పార్టీ అభ్యర్థుల పేర్లు అన్ని స్థానాల్లో వెల్లడి కాలేదు. అన్ని పార్టీల్లోనూ టికెట్లు దక్కని వారంతా ఒకింత అసంతృప్తితో రగిలిపోతున్నారు.

బీ రెడీగా ఉన్న బీఆర్ఎస్

బీఆర్ఎస్ పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఇవ్వడంతో అసంతృప్తి నేతలు కొంత కాలం అంతర్గతంగా కొట్లాడి ఇప్పుడు సైలెంట్ అయ్యారు. ఖానాపూర్ పరిధిలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేకు సీటు ఇవ్వకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ కాంగ్రెస్‌కు చేరువయ్యారు. టికెట్ దక్కినవారంతా ఎన్నికల ప్రచారం 'కారు' స్పీడ్‌తో వెళ్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులు బీఫాం అందుకున్నారు. ఎన్నికల ఖర్చు కూడా రూ.40లక్షల చొప్పున పార్టీ అధినేత సీఎం కేసీఆర్ నుంచి తీసుకున్నారు. ఇక క్షేత్రస్థాయిలో ప్రచార కార్యక్రమాలు ఉధృతంగా చేసేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు.

కాంగ్రెస్‌లో పొత్తు చిచ్చు!

కాంగ్రెస్ పార్టీలో బెల్లంపల్లికి మాజీ మంత్రి గడ్డం వినోద్, మంచిర్యాల నుంచి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుకు టికెట్ ఖరారైంది. మిగిలిన ఖానాపూర్, చెన్నూరులో పెండింగ్‌లో ఉండడంతో ఎవరికి అవకాశం ఇస్తున్నారోనని ఆశావహుల్లో టెన్షన్ కొనసాగుతోంది. ఖానాపూర్‌లో ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్ పోటీపడుతుండడంతో ముందు నుంచి ఉన్న నాయకులు ఆందోళన చెందుతున్నారు. చెన్నూరు సీటు పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయిస్తారని పార్టీ ఆలోచిస్తున్న క్రమంలో సస్పెన్స్ కొనసాగుతోంది. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట సీపీఐకి కేటాయించడం, సీపీఐ కోరిన బెల్లంపల్లి సీటు కాకుండా ఈ సీటు ఇవ్వడంపై ఇరు పార్టీ నాయకుల్లోనూ అయిష్టత ఉంది. ఈ క్రమంలో పార్టీ నుంచి ఆశావహులు ఇప్పటికే సీపీఐకి కేటాయించొద్దని నిరసనలు చేస్తున్నారు. మరో వైపు ఎర్రజెండా పార్టీ నాయకులు సైతం పోటీకి సిద్ధంగా లేకపోవడంతో ఈ సీటుపై ఉత్కంఠ కొనసాగుతోంది. కొందరు కాంగ్రెస్ నాయకులు సీపీఐలో చేరి పోటీ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలు చేస్తున్నారు.

బీజేపీలో జాప్యం!

ఎన్నికల షెడ్యూల్ వెలువడి పది రోజులు కావొస్తున్నా బీజేపీలో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు వెల్లడి కాలేదు. జిల్లా నుంచి మంచిర్యాల స్థానానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావుకు దాదాపు ఖాయంగా చెబుతున్నారు. అయితే ఇక్కడ బీసీకి టికెట్ ఇవ్వాలనే నినాదంతో కొందరు టికెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. నేడో, రేపో అధికారికంగా పార్టీ నుంచి ప్రకటన రావాల్సి ఉంది.

బీఎస్పీ, ఇతర పార్టీలు

బీఎస్పీ, వైఎస్సార్‌టీపీ, టీడీపీ నుంచి ఇంకా అభ్యర్థులు ఖరారు కాలేదు. ఆ పార్టీ సైతం అన్ని స్థానాల్లో పోటీ చేయనున్న క్రమంలో టికెట్ ఆశిస్తున్న వారంతా ఎదురు చూస్తున్నారు. బీఎస్పీ నుంచి ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థిగా బన్సీలాల్‌ను ఎంపిక చేసింది. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు స్థానాలకు ప్రకటించాల్సి ఉంది. పార్టీ నాయకులు ఎదురు చూస్తున్నారు.

వివేక్ పోటీ చేస్తారా?

బీజేపీలో జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఉన్న మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది కార్యకర్తలు, నాయకుల్లో చర్చ నడుస్తోంది. పెద్దపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి జిల్లా ధర్మపురి, జిల్లా నుంచి చెన్నూరు, బెల్లంపల్లిలో ఆయన ఏదో ఒకటి ఎంపిక చేసుకుంటారని పార్టీ నాయకులు అనుకుంటున్నారు. మొదట కొన్నాళ్లు చెన్నూరులో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. అక్కడి నుంచే పోటీలో ఉంటారని అనుకున్నారు. పోటీపై నోటి నుంచి ఇప్పటికీ ప్రకటన రాలేదు. ఇక బెల్లంపల్లిలో అన్న వినోద్ కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్నారు. అక్కడ పోటీ చేసే అవకాశమే లేదని పార్టీ నాయకులు అంటున్నారు. ధర్మపురి నుంచి పోటీ చేస్తారనేది కూడా సందేహంగా ఉంది. దీంతో పోటీ చేస్తారా? లేదా? అనే సస్పెన్స్‌కు తెరపడడం లేదు. మరోవైపు వివేక్ తన అనుచర వర్గానికే టికెట్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని సొంత పార్టీ నాయకులే వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న వారి పరిస్థితి గందరగోళంగా మారింది.

సంక్షేమ పథకాలను అధ్యయనం చేయాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ ప్రొబేషనర్స్(ఎఫ్‌టీపీ) శిక్షణ కార్యక్రమం కోసం జిల్లాకు వచ్చిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని లక్సెట్టిపేట మండలం గుల్లకోట, హాజీపూర్ మండలం దొనబండ, తాండూర్ మండలం మాదారం, బెల్లంపల్లి మండలం పాతబెల్లంపల్లి, భీమిని మండలం బిట్టూర్‌పల్లి గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరిశీలించాలని అన్నారు. గ్రామీణ జీవితంలోని సామాజిక, ఆర్థిక అంశాలు, నిర్దిష్ట లక్ష్యాలను తెలుసుకోవాలని, అనుభవపూర్వక అభ్యాసానికి ఇది మంచి అవకాశమని తెలిపారు. ఒక గ్రామంలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల ప్రగతి గతిశీలతను అధ్యయనం చేయాలని, గ్రామీణ ప్రజలు ముఖ్యంగా బీపీఎల్ కుటుంబాలు, భూమి లేని కార్మికులు, ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను తెలుసుకోవడం, సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలలో మహిళల భాగస్వామ్య స్థాయిని తెలుసుకోవడం అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, సంక్షేమ అధికారి చిన్నయ్య, జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, బెల్లంపల్లి, మంచిర్యాల డీఎల్‌పీవోలు ఫణీందర్‌రావు, ప్రభాకర్, ఎంపీడీవో అబ్దుల్ హై, ఎంపీవోలు సబ్దల్ అలీ, వేదాల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే దివాకర్‌రావు
- పట్టణాల్లో ఎన్నికల ప్రచారం



సీతారాంపల్లిలో దివాకర్‌రావు ప్రచారం

నస్పూర్/మంచిర్యాలటౌన్: బీఆర్ఎస్ గెలుపుతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం ఆయన నస్పూర్ పట్టణంలోని సీతారాంపల్లి గ్రామంలో, మంచిర్యాల 19వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేసీఆర్ బీమా, సౌభాగ్యలక్ష్మి వంటి అనేక సంక్షేమ పథకాలను మేనిఫెస్టోలో పొందుపర్చామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సమస్యలపై ప్రశ్నించిన స్థానికులు..

తమ గ్రామంలో నెలకొన్న సమస్యలపై అనేక సార్లు విన్నవించినా పరిష్కరించలేదని సీతారాంపల్లి గ్రామస్తులు పలువురు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. మురుగు కాలువ లేకపోవడంతో నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోందని, ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా కల్వర్టు నిర్మించలేదని వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానికులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. తాను గెలిచిన మూడు నెలలో కల్వర్టు నిర్మిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వంగ తిరుపతి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్ రెడ్డి, కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు డీ.అన్నయ్య, నాయకులు దెబ్బటి రామన్న, రాజేంద్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూముల పరిశీలన



రూములను పరిశీలిస్తున్న డీసీపీ, ఆర్వో

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్, ఆర్వో సిడాం దత్తు సోమవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని పేర్కొన్నారు. చెన్నూర్ తహసీల్దార్ మల్లిఖార్జున్, భీమారం తహసీల్దార్ విశ్వంభర్, సీఐ వాసుదేవరావు, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

మంచిర్యాలటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మంచిర్యాల అసెంబ్లీ బూత్ స్థాయి కార్యకర్తల సమ్మేళనాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజల్లోనే ఉంటూ పనిచేయాలని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి చెందుతుందని ప్రజలకు భరోసా ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ అవినీతి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో జాతీయ రహదారులు, గ్రామాల్లో రోడ్లు, రైతువేదికలు, శ్మశాన వాటికల నిర్మాణం అయ్యాయని, గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు శూన్యమని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ ఒకటేనని, మంచిర్యాలలో ప్రేమ్‌సాగర్‌రావు గెలిస్తే బీఆర్ఎస్ పార్టీలో చేరడం ఖాయమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇంచార్జి మహేశ్, గోనె శ్యాంసుందర్‌రావు, ముల్కల్ల మల్లారెడ్డి, పెద్దపల్లి పురుషోత్తం, మున్నరాజ సిసోడియా, రజనీశ్ జైన్, బూస నర్సింహులు, గోలి రాము, గుండా ప్రభాకర్, తోట మల్లిఖార్జున్, ఆకుల అశోక్‌వర్ధన్, మోటపలుకుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న డీసీపీ, ఏసీపీ

వేమనపల్లి: ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో బాధ్యతాయుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకూడదని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. సోమవారం మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్‌తోపాటు జాజులపేట, సుంపుటం, వేమనపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. వేమనపల్లిలోని ప్రాణహిత పుష్కరఘాట్ ఫెర్రీ పాయింట్‌ను సందర్శించి పడవలు నడిపే వారితో మాట్లాడారు. జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సైలు సుబ్బరావు, సురేష్ పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కోటపల్లి: ఎన్నికల భద్రత చర్యల్లో భాగంగా రాపన్‌పల్లి ప్రాణహిత నదిపై ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశించారు. సోమవారం చెక్‌పోస్టును సందర్శించి వాహనాలు తనిఖీ చేశారు. మహారాష్ట్ర మీదుగా డబ్బులు, మద్యం రాకుండా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేపట్టాలని సూచించారు. అన్నారం, పంగిడిసోమారం గ్రామాల్లో పర్యటించి బాధ్యతాయుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

నెన్నెల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, జంగాల్‌పేట, ఖర్జీ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ సోమవారం సందర్శించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌ను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో 12-డీపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇంటి వద్దనే ఓటు వేస్తామన్న వారికి 12-డీ ఫామ్‌ను అందజేశారు. ఎంపీడీఓ వరలక్ష్మి, ఎస్సై శ్యాంపటేల్, ఆర్ఐ గణేష్ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

లక్సెట్టిపేట: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఏసీపీ తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్, ఇటిక్యాల, జెండవెంకటాపూర్, వెంకట్‌రావ్‌పేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్ పాల్గొన్నారు.

ముగిసిన గురుకులాల క్రీడాపోటీలు



జాకారం క్రీడాకారులకు బహుమతి అందిస్తున్న కమిషనర్ సమ్మయ్య



మంథని క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న కమిషనర్ సమ్మయ్య

- అండర్-17, 19 ఓవరాల్ చాంపియన్ షిప్ జాకారం విద్యార్థులు
- అండర్-14 ఓవరాల్ చాంపియన్ షిప్ మంథని విద్యార్థులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యాలయంలో నిర్వహించిన 9వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ మంగళవారం అట్టహాసంగా ముగిసింది. ఈ నెల 13 నుంచి ప్రారంభమై నాలుగు రోజుల పాటు పోటీలు సాగాయి. కాళేశ్వరం జోన్ పరిధిలోని ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు చెందిన 11 సాంఘిక సంక్షేమ బాలుర గురుకులాల నుంచి దాదాపు 1200మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలు హోరాహోరీగా సాగాయి. వ్యక్తిగత అథ్లెటిక్స్‌లోనూ క్రీడాకారులు మెరుగ్గా రాణించారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కే.సమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఆదిలాబాద్, కుమురంభీమ్, మంచిర్యాల జిల్లాల కోఆర్డినేటర్లు ఎస్.శ్రీనివాస్, పి.బాలరాజు, ఆర్.బాలభాస్కర్ జోన్‌ల వారీగా ఇంచార్జీ బాధ్యతలు నిర్వర్తించారు. సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాల్‌లు, సీనియర్ పీడీలు క్రీడాపోటీల నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు.

అండర్-14 విభాగంలో..

అండర్-14 విభాగంలో పెద్దపల్లి జిల్లా మంథని సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుచుకున్నారు.

కబడ్డీ: విన్నర్స్ ఆసిఫాబాద్ జట్టు, రన్నర్స్ సిర్పూర్-టీ జట్టు
ఖోఖో: విన్నర్స్ మంథని, రన్నర్స్ జాకారం
టెన్నీకాయిట్ డబుల్స్: విన్నర్స్ జాకారం, రన్నర్స్ మంథని
సింగిల్స్‌లో.. చెస్‌పోటీల్లో జే.విష్ణు(మంథని) విజేతగా నిలువగా, చక్రపాణి(కోటపల్లి) రన్నరప్‌గా నిలిచాడు.
క్యారమ్స్ డబుల్: సందీప్, కార్తీక్(ఆసిఫాబాద్) విజేతలుగా, శ్రీకాంత్, హర్ష(ఏటూరునాగారం) రన్నరప్‌గా జయకేతనం ఎగురవేశారు.

అండర్-17 విభాగంలో..

ఈ విభాగంలో ములుగు జిల్లా జాకారం సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు.

ఖోఖో: విన్నర్స్ మంథని, రన్నర్స్‌గా జాకారం
బాల్‌బ్యాడ్మింటన్: విన్నర్స్ జాకారం, రన్నర్స్ మంథని
హ్యాండ్‌బాల్: విన్నర్స్ జైపూర్, రన్నర్స్ సిర్పూర్-టీ
ఫుట్‌బాల్: విన్నర్ జైపూర్, రన్నర్స్ జాకారం
టెన్నీకాయిట్: విన్నర్స్ జాకారం, రన్నర్స్ మంథని
సింగిల్స్‌లో..
చెస్: పి.గౌతమ్(ఆసిఫాబాద్) విన్నర్‌గా, జి.గోపి(జైపూర్) రన్నరప్‌గా నిలిచారు.
క్యారమ్స్ డబుల్స్: కే.రాజేష్, ఎం.సుజిత్ (జాకారం) విన్నర్స్‌గా, కృష్ణ, శ్రీకాంత్(కాసిపేట) విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్-19 విభాగంలో..

ఈ విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను జాకారం క్రీడాకారులు సాధించారు.

కబడ్డీ: విన్నర్స్ జాకారం, రన్నర్స్ మంథని
ఖోఖో: విన్నర్స్ మంథని, రన్నర్స్ జైపూర్
వాలీబాల్: విన్నర్స్ కోటపల్లి విద్యార్థులు, రన్నర్స్ జాకారం విద్యార్థులు
బాల్‌బ్యాడ్మింటన్: విన్నర్స్‌గా సిర్పూర్-టీ, రన్నర్స్‌గా ఏటూరు నాగారం
హ్యాండ్‌బాల్: విన్నర్స్ జైపూర్, రన్నర్స్ మంథని
ఫుట్‌బాట్: విన్నర్స్ జైపూర్, రన్నర్స్ జాకారం
టెన్నీకాయిట్ డబుల్: విన్నర్స్ జాకారం, రన్నర్స్ ఏటూరునాగారం
టెన్నీకాయిట్ సింగిల్స్: జే.మారుతి(ఆసిఫాబాద్) విన్నర్‌గా, జే.కృష్ణబాబు(జాకారం) రన్నర్‌గా నిలిచారు.
క్యారమ్స్ డబుల్స్: బి.సన్నీ, బి.జశ్వంత్(జాకారం) విన్నర్స్‌గా, ఆర్.అజయ్, జే.సాయికుమార్(ఆసిఫాబాద్) రన్నర్స్‌గా నిలిచారు.

ముగిసిన జోనల్ స్థాయి పోటీలు



మాట్లాడుతున్న రిటైర్డ్ పీఈటీ రామయ్య

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు సమావేశానికి రిటైర్డ్ పీఈటీ కారెంగుల రామయ్య హాజరై మాట్లాడారు. కళాశాల జూనియర్ లెక్చరర్ ఆత్మహత్య చేసుకొని మృతిచెందడంతో ముగింపు వేడుకలను నామమాత్రంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజమణి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పీఈటీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మృతదేహం లభ్యం


రాజమల్లు మృతదేహం

చెన్నూర్: చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని మహంకాళివాడకు చెందిన దబ్బెట రాజమల్లు (30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం మద్యం సేవించి ఇంటికి రావడంతో అతని భార్య మందలించింది. దీంతో ఇంటినుంచి బయటకు వెళ్లాడు. మద్యం మత్తులో పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


రాజశేఖర్ మృతదేహం

దండేపల్లి(మంచిర్యాల): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నంబాలకు చెందిన దాసరి రాజశేఖర్ (21) కూలి పనులకు వెళ్లకుండా ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఏదైనా పనిచేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 12న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా లక్సెట్టిపేటకు, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తాపడి ఒకరు మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని వెంకట్‌రావుపేట సమీపంలోని రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాము తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన దత్తు (36) కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గుడిహత్నూర్ నుంచి ఆటోలో మంచిర్యాలకు వస్తుండగా వెంకట్‌రావుపేట సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఘటనలో దత్తుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు దిగంబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త!

- రాజకీయ పక్షాలకు కొమ్ముకాయొద్దు
- ప్రచారంలో పాల్గొంటే వేటే..
- ఎన్నికల కమిషన్ పకడ్బందీ ఆదేశాలు

జంగ్ తెలంగాణ

కెరమెరి(ఆసిఫాబాద్): ఎన్నికల సంఘం నియమావళి అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తుంది. ఉద్యోగులు కేవలం తమ విధుల నిర్వహణకు మాత్రమే పరిమితం కావాలని, ఏ రాజకీయ పక్షానికీ కొమ్ము కాయవద్దని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఎన్నికల నియమావళి నిబంధనలపై వివిధ శాఖల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. పార్టీలకు అనుకూలంగా పనిచేసినా.. ప్రచారంలో పాల్గొన్నా వేటు తప్పదు.

నిబంధనలు ఇవే..

- ప్రభుత్వ ఉద్యోగులు ఏరాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనవద్దు.
- పలానా పార్టీకి ఓటేయాలని కిందిస్థాయి ఉద్యోగులను నిర్దేశించకూడదు.
- ఓటర్లు ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు.
- రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం నిర్వహించకూడదు.
- సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు చేయకూడదు.
- అధికార, ప్రతిపక్ష పార్టీలకు సమదూరంలో ఉద్యోగులు ఉండాలి.
- ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ప్రచార సమావేశాలు, సభలపై వీడియో సర్వలైన్స్, స్టాటిస్టికల్ సర్వలైన్స్ బృందాలు వీడియో చిత్రీకరిస్తున్నాయి. వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీక్షిస్తాయి. అందులో ఉద్యోగులు పాల్గొన్నట్లు రాజకీయ పార్టీకి చెందిన ప్రతినిధి ఫిర్యాదు చేస్తే ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుంది.
- నిర్ధారణ అయితే సదరు ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడుతుంది.
- సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు, మీడియాలో వచ్చే వార్తలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా మీడియా మానిటరింగ్ టీంను ఏర్పాటు చేశారు.
- ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉద్యోగులు పోస్టులు చేస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోనుంది.
- ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన ఉద్యోగులను మొదట విధుల నుంచి తప్పించి విచారణ చేపడతారు.
- ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే సమావేశాలకు రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించవద్దు.
- నూతన నిర్మాణాలు, పథకాలు నాయకుల చేత ప్రారంభించకూడదు.
- వారిచ్చే కానుకలు తీసుకోకూడదు. వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగవద్దు.
- నాయకుల వాహనాల్లో ప్రయాణించవద్దు.
- స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ, ఇతర ఆర్థిక కార్యక్రమాల్లో పాల్గొన్న సమయంలో తీర్మాణం కాపీ తప్పనిసరిగా ఉండాలి.


ఉద్యోగులకు ఎన్నికల నియమావళి వివరిస్తున్న కెరమెరి ఎంపీడీవో మహేందర్

‘గిరి’పుత్రుల్లో చైతన్యం

- 2018 ఎన్నికల్లో గిరిజన గ్రామాల్లో 85శాతం పైనే పోలింగ్



ఇచ్చోడ(బోథ్): 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పలు మారుమూల గిరిజన గ్రామాల్లో 85 శాతంకు పైగా పోలింగ్ నమోదైంది. అంతకుముందు వాటన్నింటినీ సమస్యాత్మక గ్రామాలుగా పోలీసులు, ఎన్నికల అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో అత్యంత మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఆయా గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల అధికారులు, పోలీసులకు కత్తిమీద సాములాగే ఉండేది. గతంలో నక్సల్స్ ప్రభావిత గ్రామాలుగా గుర్తింపబడి ఎన్నికలు బహిష్కరించిన గ్రామాలు సైతం ఇందులో ఉండడం విశేషం. కానీ 2018లో నిర్వహించిన ఎన్నికల్లో అధికశాతం మంది ప్రజలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 85 శాతంకు పైగా పోలింగ్ నమోదు రికార్డు సృష్టించి గత చరిత్రను తుడిచివేశారు.

బోథ్ నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ నమోదైన గ్రామాలు

పీఎస్ నంబర్	గ్రామం	మండలం	పోలింగ్ శాతం
01	గుబిడి	తాంసి	85.0
15	మార్కగూడ	తాంసి	93.03
24	పాలోది	తాంసి	90.02
34	గిరిగావ్	తాంసి	89.01
35	అంబుగావ్	తాంసి	90.5
36	పల్సి(కె)	తలమడుగు	92.02
59	దెహగావ్	తలమడుగు	88.04
62	నందిగామ	తలమడుగు	93.02
117	సల్యాద	ఇచ్చోడ	95.01
131	ఎల్లమ్మగూడ	ఇచ్చోడ	91.04
207	కుంటల(కె)	నేరడిగొండ	88.02
215	బోరిగామ	నేరడిగొండ	92.06
218	గుత్పల	నేరడిగొండ	88.03
220	లింగాట్ల	నేరడిగొండ	88.01
222	రాజూర	నేరడిగొండ	85.04

ముధోల్‌లో పెరుగుతున్న పోలింగ్ శాతం

- 2018లో 98.7 శాతంగా నమోదు

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరుగుతోంది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో దాదాపు 70 శాతానికి మించి పోలింగ్ శాతం నమోదు కాగా 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 98.7 శాతంగా నమోదైంది. 2023 ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,46,030 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,19,910 మంది, మహిళలు 1,26,102 మంది, ఇతరులు 18 మంది ఉన్నారు.

ఏడాది	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1978	92,616	65,681	70.9
1983	1,02,536	71,277	69.5
1985	1,10,291	77,404	70.2
1989	1,21,909	96,494	79.2
1994	1,41,112	1,11,081	78.7
1999	1,62,379	1,22,057	75.2
2004	1,67,579	1,28,712	76.8
2009	1,75,877	1,38,102	78.5
2014	2,08,805	1,62,872	78.0
2018	1,86,418	1,81,696	98.7

యువతదే నిర్ణయం..!

- గెలుపోటములను ప్రభావితం చేసేది వారే..

ఇచ్చోడ/బోథ్: ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా 96,668 మంది యువ ఓటర్లు ఉన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసి సత్తా చాటే శక్తి యువత చేతిలోనే ఉంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,35,743 మంది ఉండగా యువ ఓటర్లు 54,998 మంది ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,06,690 మంది ఉండగా యువ ఓటర్లు 41,670 మంది ఉన్నారు. దీంతో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న ప్రధాన పార్టీలు యువతపై దృష్టి పెట్టాయి. అయితే యువత దాదాపు చదువుకున్న వారు ఉండటం, సామాజిక అంశాలు తెలుసుకునే సామర్థ్యం ఉండటంతో ఎటువైపు మొగ్గు చూపుతారోనని రాజకీయ పార్టీల నాయకుల్లో కలవరం నెలకొంది.

యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం

యువతను ప్రోత్సహించేందుకు, ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా ఈసారి ఎన్నికల సంఘం ప్రతీ నియోజకవర్గంలో యువత ఎక్కువగా ఉన్నచోట ప్రత్యేకంగా యూత్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు సైతం యువకులే ఉండేలా ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

బాధ్యతగా ఓటు వినియోగించుకోవాలి

ఎన్నికల్లో యువత బాధ్యతగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలి. బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో యువ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– చాహత్ బాజ్‌పాయ్, బోథ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి


ప్రలోభాలకు లొంగవద్దు



ప్రజాస్వామ్యంలో నచ్చిన వ్యక్తికి ఓటు వేసి ప్రజాప్రతినిధిగా ఎన్నుకునేలా రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు. అందుచేత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకుని రాజ్యాంగా విలువలు కాపాడుతా.

– అశ్విని సూర్యవంశీ, బజార్‌హత్నూర్

ఓటు అమ్ముకోవద్దు



మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనుండడంతో చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంతో పాటు అవినీతికి పాల్పడని వారికే ఓటు వేస్తా. ఓటు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు. ఓటును ఎవరూ అమ్ముకోవద్దు.

– సాయితేజ, బజార్‌హత్నూర్

సమస్యలు పరిష్కరించే వారికే..



ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక నిరుద్యోగులు చాలాకాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో యువత సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తా.

– సిద్దవేని అభిగౌడ్, సిరికొండ

చెరువులో దూకి అధ్యాపకురాలి బలవన్మరణం

- చెన్నూర్‌లో కలకలం రేపిన ఘటన
- ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని బంధువుల ఆందోళన


తిరుమలేశ్వరి (ఫైల్)

చెన్నూర్: చెరువులో దూకి అధ్యాపకురాలు బలవన్మరణం చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ వాసుదేవరావు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నస్పూర్ మండలానికి చెందిన పసునూటి తిరుమలేశ్వరి (32) చెన్నూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. సోమవారం ఉదయం విధుల్లో భాగంగా కళాశాలకు వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేసింది. అనంతరం బయటకు వెళ్తుండగా తోటి ఉపాధ్యాయురాలు ప్రశ్నించడంతో సెల్‌ఫోన్ మర్చిపోయాను.. ఇంటికి వెళ్లివస్తానని చెప్పింది. 10 గంటల ప్రాంతంలో పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న భర్త సంపత్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కీలకంగా మారిన వాయిస్ రికార్డు..

ఆత్మహత్యకు ముందు తిరుమలేశ్వరి తన మృతికి కళాశాల ప్రిన్సిపాల్, ఏటీసీ, పీఈటీతో పాటు మరో ఉపాధ్యాయురాలు కారణమని సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డు చేసింది. ఇదే కేసులో కీలకంగా మారింది. వాయిస్ రికార్డు ఆధారంగా మృతురాలి భర్త సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు.

బంధువుల ఆందోళన

మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు కుమారస్వామి, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి గురుకుల కళాశాల అధికారులు వచ్చే వరకు పోస్టుమార్టం చేయవద్దని భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో స్వరూపారాణి వచ్చి మృతురాలి కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తిరుమలేశ్వరి ఉద్యోగాన్ని భర్త సంపత్‌కు ఇస్తామని, ఆమెకు రావాల్సిన బెనిఫిట్స్ కుమార్తె పేరున అందజేస్తామని రాసివ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రిన్సిపాల్, ఏసీటీ, మరో ముగ్గురిపై కేసు నమోదు

అధ్యాపకురాలి మృతి కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన తిరుమలేశ్వరి ఉద్యోగ రీత్యా చెన్నూర్‌లోని ఆదర్శనగర్‌లో నివాసం ఉంటోంది. నాలుగేళ్లుగా గురుకుల కళాశాల లెక్చరర్‌తో పాటు మెస్ కేర్‌టేకర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తోంది. కొన్ని రోజులుగా ప్రిన్సిపాల్ రాజమణి, ఏసీటీ ప్రవంతి, పీఈటీలు రేష్మ, శిరీష, మరో ఉపాధ్యాయురాలు పుష్పలత వేధింపులకు గురిచేస్తున్నారని మృతురాలి భర్త సంపత్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘ప్రవళికది ప్రభుత్వ హత్యే’

మంచిర్యాలఅగ్రికల్చర్: పోటీ పరీక్షలు రద్దు కావడంతో మనస్తాపానికి గురైన ప్రవళిక భవిష్యత్‌లో ఉద్యోగం సాధించాలేమన్న మానసిక ఆవేదనతోనే ఆత్మహత్యకు పాల్పడిందని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని డీవైఎఫ్ఐ నాయకులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రవళిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందిన లోనరే సురేశ్(30) అనే యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుడకు చెందిన శోభ, బాలాజీ దంపతుల కుమారుడు సురేశ్ ప్రతి రోజూ మద్యం తాగి డబ్బుల కోసం కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం వంజీరి గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి గ్రామానికి చెందిన వడాయి శ్రీకాంత్(20), అతడి స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి బైక్‌పై సోమవారం ఆసిఫాబాద్‌కు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వంజీరి గ్రామం వద్ద వీరి బైక్‌ను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రవీణ్ క్షేమంగా బయటపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

సిర్పూర్(టి): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని హుడ్కిలిలో చోటు చేసుకుంది. ఎస్సై దీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కౌటాల మండలం మొగడ్‌దగడ్‌కు చెందిన నైతం రమేశ్(38) హుడ్కిలి గ్రామంలోని అత్తగారి ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. కొన్నిరోజులుగా రమేశ్ మతిస్థిమితం తప్పినట్లు వ్యవహరిస్తున్నాడు. సోమవారం పొలం వద్ద పశువులు మేపుతూ గట్టుపై ఉన్న పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. పొలంలో పనిచేస్తున్న భార్య మమత గమనించి ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతినగర్‌లో బత్తిని శ్రీనివాస్ గౌడ్‌కు చెందిన ఇల్లు సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. టీవీ, కూలర్, బీరువా, బట్టలు, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. 2వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ సమాచారంతో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

దేశీదారు పట్టివేత


పట్టుకున్న దేశీదారు బాటిళ్లు

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యం బాటిళ్లను పట్టణ సీఐ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన గణేష్ నర్సింగ్ బోగవార్ నుంచి 250 సీసాల దేశీదారు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేశీదారు అమ్మినా, అక్రమ రవాణాకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు కళ్యాణ్, శ్రీకాంత్, కానిస్టేబుల్ సురేశ్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లిలోని ఓ బెల్ట్ షాపులో సోమవారం దాడులు నిర్వహించి మద్యం పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. అనుమతి లేకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి 8 క్వార్టర్ బాటిళ్లు, 2 బీర్లు పట్టుకున్నారు. వాటి విలువ దాదాపు రూ. రెండు వేల వరకు ఉంటుందని, మద్యం సీజ్ చేసి దుకాణ యజమాని లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరుచోట్ల నగదు పట్టివేత

బెల్లంపల్లిలో 9.09 లక్షలు..

బెల్లంపల్లి: పట్టణంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.9.09 లక్షల నగదు పట్టుకున్నారు. కాల్‌టెక్స్ రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జిపై పోలీసులు జరిపిన తనిఖీలో బెల్లంపల్లికి చెందిన వొల్లాల నరేష్ వద్ద రూ.2,10,500, భీమిని మండలానికి చెందిన సబ్బని ముఖేష్ వద్ద రూ.50,500 పట్టుకున్నారు. కన్నాల జాతీయ రహదారిపై హన్మాన్‌బస్తీకి చెందిన దవ రామకృష్ణ వద్ద రూ.1.01లక్షలు, బజారు ఏరియాలో తిర్యాణి మండలం చింతపల్లికి చెందిన ఆత్రం అమృతరావు వద్ద రూ.2.47లక్షలు, బెల్లంపల్లి కన్నాలబస్తీకి చెందిన ఎండి అలీమొద్దిన్ వద్ద రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో ఎఫ్ఎస్‌టీ అధికారి ఎల్తురి సురేఖకు నగదు అప్పగించినట్లు టూటౌన్ ఎస్సై తెలిపారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీలో సోమవారం రూ.3.10 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా నస్పూర్‌కు చెందిన పోతురాజుల మల్లేశ్ వద్ద రూ.2.10 లక్షలు, పుసుపునూరి శంకర్ వద్ద రూ.లక్ష నగదు పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

బెల్లంపల్లి మండలంలో రూ.లక్ష..

బెల్లంపల్లిరూరల్: మండలంలోని లంబాడి తండా శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా కన్నెపల్లికి చెందిన రాజు వద్ద రూ.1,05,000 నగదు పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో జప్తు చేసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఎల్తూరి సురేఖకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.


ఎఫ్ఎస్‌టీ అధికారికి నగదు అందజేస్తున్న ఎస్సై

జన్నారంలో రూ.1.50 లక్షలు

జన్నారం: మండలంలోని మందపెల్లి స్టేజీవద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అంజయ్య అనే వ్యక్తి వద్ద రూ.1.50 లక్షల నగదు పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

జైపూర్‌లో రూ.80వేలు

జైపూర్: మండల కేంద్రంలో ఎస్సై ఉపేందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇందారం గ్రామానికి చెందిన రాజయ్య వద్ద రూ.80 వేల నగదు పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లుగా ఎస్సై తెలిపారు.

రూ.2 లక్షలు స్వాధీనం

మంచిర్యాలక్రైం: పట్టణంలో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా కాలేజ్‌రోడ్‌కు చెందిన ముస్త్యాల నితిన్ వద్ద నుంచి రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. నగదును ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి హన్మంతరెడ్డికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్


బైండోవర్ అయిన పాత నేరస్తులు

మంచిర్యాలక్రైం: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా సోమవారం పట్టణంలోని పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు సీఐ రాజు తెలిపారు. మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన 40 మంది పాత నేరస్తులను రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు అరెస్ట్ చేసి తహసీల్దార్ ప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఒకరిపై దాడి కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఓ దాడి ఘటనలో సోమవారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. హాజీపూర్‌కు చెందిన పూదరి రవీందర్, పార్వతి తిరుపతి మట్టి ట్రిప్పులకు సంబంధించిన డబ్బుల పంపకంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రవీందర్ కుర్చీతో తిరుపతిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. తిరుపతి భార్య సుజాత ఫిర్యాదు మేరకు రవీందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్‌కే ఓసీలో షావెల్ ప్రారంభం


ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే ఓసీలో నూతనంగా కొనుగోలు చేసిన మంజీర షావెల్‌ను సోమవారం ఏరియా జీఎం మనోహర్ ప్రారంభించారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ యంత్రాలను వినియోగించాలని, రక్షణ విషయంలో రాజీపడకుండా ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లు, ఇంజినీర్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.